"నా మాట నమ్మండి ఇంటర్వ్యూ కోసం యూనివర్సిటీకొచ్చాను. తిరిగి వెళ్తూ కొద్దిగా టిఫిన్ తీసుకుందామని యిక్కడాగాను. టిఫిన్ చేసి లేచేసరికి జేబులో వుండవలసిన పర్సు బెంచీ క్రింద పడుంది అందులో వుండవలసిన ఇరవై రెండ్రూపాయలు లేవు." యిదీ జరిగిన విషయం అన్నట్లు ఆగాడు నిరుద్యోగి సుబ్బారావు అసలు సిసలైన నిర్దోషిలా.

దోసె తిరగేస్తున్న అట్లకాడ నిశ్చలమై పోయింది.

వినోదం కోసం కాచుక్కూర్చున్న కళ్లు కొంచెం ముందుకు వంగాయి.

రాజకీయాల్ని, దుష్కర్మల్ని బుర్రలోకెక్కించుకుంటున్న కళ్లు కళ్లద్దాల తెరల్ని తొలగించి వేడుకగా చూచాయి.

టీ కొట్టాడి గంభీర కంఠస్వరానికి జీవమొచ్చింది: "చూడబ్బాయ్ నువ్వు సవాలక్ష కథలు చెప్పుగాక నమ్మేదిలేదు. అనవసరంగా విసిగించకుండా రెండ్రూపాయల బిల్లిచ్చి కదులిక్కణ్ణుంచి."

సుబ్బారావు దసలే షికీకి గుండె, ఈ దెబ్బతో "అంబా" అంది.

పర్సులోని డబ్బులు కొట్టేయబడ్డాయని తెలిశాక.... అవి యిహ తన చేతికి రావని నిశ్చయించుకున్నాక గత్యంతరం లేనట్లు, "ఓ గంట టైమివ్వండి. మీడబ్బు పికిచ్చేస్తాను." అన్నాడు సుబ్బారావు.

"వెళ్లినవాడివి వెళ్లినట్టే వెళ్తే నూకే మిటి మిగిలేది... బూడిద" పెనం మీద దోసె తిరగేస్తూ డబ్బులివ్వకపోతే నీకూ యిదేగతి పడుతుంది అన్నట్లు సింబాలిక్‌గా చూశాడు టీ కొట్టాయన.

"అంత నమ్మకం లేనిపక్షంలో యీ బియ్యే సర్టిఫికెటు వుంచండి మళ్లీవచ్చి తీసుకెళ్తాను" ఫైలు ఓపెన్ చేస్తూ అన్నాడు సుబ్బారావు.

"మాదగ్గర పొయ్యి ముట్టించుకునేందుకు...పొట్లాలు కట్టించేందుకు కాగితాలు యింతకన్న మంచివేవున్నాయి లే...ముందు డబ్బులు తియి" హెచ్చరికగా అన్నాడు టీ కొట్టాయన ..గాడిదా గంధం చెక్కల సామెతలో తప్పులేదని ఋజువు చేస్తూ.

మూడు సంవత్సరాలు కష్టపడి వేలకు వేలు తగలేసి అహోరాత్రులు నిద్రకి కరువై, నిద్రని అక్షరాలుగా మార్చి, కలంతో కాలంతో భయంకర యుద్ధం సాగించి ఫస్ట్‌క్లాసులో పాసయినందుకు యూనివర్సిటీవాళ్లు సగౌరవంగా ప్రధానం చేసిన బియ్యే సర్టిఫికెటు విలువ, పొట్లాలు కట్టియిచ్చే చిత్తుకాగితం విలువకన్న ఓ మెట్టు తక్కువేనని అంటోంటే గుండెల్లో ఎవరో కత్తులతోట నాటినట్లనిపించింది సుబ్బారావుకి. అలవికాని ఊళ్లో అధికులం అనటం బావుండదని గుర్తించిన వాడు కనుక, గుండె నిబ్బరంతోనూ కాస్తంత పేదవాడు కనక స్తబ్ధంగా, నిస్సహాయంగా చూస్తుండి పోయాడు.

అప్పటిదాకా ఆ తతంగమంతా చూస్తున్న అప్పలనర్సుకి "వ్యవహారం సుతి మించుద్దేమో" నని అనుమానమేసి, "సిద్దయ్యా ఇతగాడెవురో గాని సూడెంటు కుర్రోణ్ణాగున్నాడు. నువ్వెంతంత మాట్లనటం...అతగాడు రెచ్చిపోవటం... అనక జుట్లు పట్టుకోవటం ...యిదంతా ఎందుకొచ్చిన గోలగానీ ఆబిల్లు నేనిత్తాలే అతన్ని పోనియ్...పోయిరా బాబూ" అంటూ సుబ్బారావు వేపు చూసేసరికి నమ్మలేకపోయాడు సుబ్బారావు యింకా యీమాత్రపు మానవత భూమ్మీద మిగిలి వున్నందుకు. అతని చూపుల్లోని కృతజ్ఞతకి చిద్విలాసంగా నవ్వాడు అప్పల నర్సు," నీపర్సులో యిరవై రెండ్రూపాయలు కొట్టేసినాను యీ మాత్రం సాయం చెయ్యలేనా" అన్నట్లు.

బ్రతుకు జీవుడా అంటూ బైటపడ్డాడు సుబ్బారావు.

ఆతర్వాత సుబ్బారావు డబ్బులు అప్పలనర్సు జేబులోకి, టీకొట్టాయన గల్లాపెట్టెలోకి విశ్లేషణం చెందడం కూడా చూశానుగానీ "అన్యాయం" అనిమాత్రం అనలేక పోయాను... అన్యాయపు కళకు పావాలక్రింద అనుక్షణం అన్యాయమైపోతూ "యిది "అన్యాయం" అని అరవలేని మూగవాళ్ల చెమటనీ పిరికి కండల్నీ... పసచచ్చిన నెత్తురునీ పంచుకున్నవాణ్ణిగదా! మెల్లగా అక్కణ్ణించి జారుకున్నాను "ఇది అన్యాయం" అంటే నేనెక్కడ అన్యాయమై పోతానోనని భయమేసి.

